ప్రజాశక్తి

సోమవారం 9 జూన్ 2025 5 శ్రీ సత్యసాయి

షైనింగ్ స్టార్ అవార్డుల ప్రధానోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లు

ప్రయివేటు పాఠశాలల ముందస్తు అడ్మిషన్లు

వివిధ రకాల పేర్లతో ఫీజుల దోపిడీ

నిబంధనలకు నీళ్లు

రూ. 20వేల నుండి 50 వేల రూపాయల వరకు ఫీజు

చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ అధికారులు విఫలం

వాల్మీకి పాఠశాల ఇచ్చిన ఫీజు రసీదు

కొనుగోలు చేసిన స్కూల్‌బ్యాగు, పుస్తకాలతో విద్యార్థి కుటుంబసభ్యురాలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

సమాజంలో విద్యకు, వైద్యానికి ఉన్న ప్రాముఖ్యత మరొకదానికి లేదు. పిల్లల తల్లిదండ్రుల ఆశల్ని విద్యార్థుల లక్ష్యాలను ఆసరా చేసుకొని క్యాష్ చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు దోపిడీకి తెరలేపాయి. చదువులను వ్యాపారంగా మార్చిన పాఠశాలలను నియంత్రించడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ కుమారుడిని ఉన్నత చదువులు చదివించి ప్రయోజకుడిని చేయటం కోసం వారి తల్లితండ్రులు పరితపిస్తుంటారు. మరికొందరు అప్పటి పరిస్థితుల్లో తామెలాగో చదవలేకపోకపోయాం... తమ బిడ్డ అయినా బాగా చదివి సమాజం కోసం ఉన్నత భవిష్యత్తు ను అందిద్దామని మరికొందరు ఆలోచిస్తూ ఉంటారు. తమ రెక్కలని ముక్కలు చేసి కాయ కష్టం చేసైనా తమ బిడ్డలను ప్రయోజకుల్ని చేయాలని కష్టార్జితంతో కూడబెట్టిన మొత్తాన్ని ఫీజులు కోసం దారపోస్తుంటారు. ఇలాంటి పరిస్థితులలో విద్యను అభ్యసిస్తున్న పిల్లల తల్లిదండ్రులను కొన్ని ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు నిలువుదోపిడీ చేస్తున్నాయి. విద్యాశాఖ చట్టాలు కఠినంగా ఉన్నా వాటిని ఏమార్చి దోపిడీకి పాల్పడుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా కొనసాగుతూ ముందస్తు అడ్మిషన్లు చేపట్టిన పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కదిరి పట్టణంలోని పలు ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు జోరందుకున్నాయి. తమ స్కూల్లో సీట్లు కూడా తక్కువగా ఉన్నాయని చెబుతూ ముందస్తు ప్రవేశాలకు వల వేయడమే కాకుండా టెక్నో, ఈ టెక్నో, ఐఐటి , ఒలంపియడ్, సాధారణ వివిధ రకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అడ్మిషన్లు ఫీజుల దోపిడీ ప్రారంభించాయి. విద్యా హక్కు చట్టం నిబంధనలను ఉల్లంఘించి యథేచ్ఛగా అడ్మిషన్లు జరుగుతున్నా విద్యాశాఖాధికారులు నిద్రమత్తులో జోగుతుండడం విమర్శలకు తావిస్తోంది. కదిరి పట్టణంలోని వాల్మీకి పాఠశాల యాజమాన్యం విద్యాశాఖ నిబంధనలకు నీళ్లు వదులుతూ ఓ పక్క కొత్త అడ్మిషన్లు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఆ పాఠశాలలో విద్య అభ్యసించే విద్యార్థులు గత ఏడాది ఫీజు బకాయి ఉంటే ప్రస్తుతం గత ఏడాది ఫీజు పూర్తిగా చెల్లించిన తర్వాత ఆ విద్యార్థుల్ని కొత్త సంవత్సరంలోకి కొనసాగిస్తామని చెబుతోందని సమాచారం. ఒక వేళ అలా చెల్లించని వారి పట్ల యాజమాన్యం మరొక అడుగు ముందుకేసి రెన్యువల్ చేయకపోవడమే కాకుండా 2025 విద్యా సంవత్సరంలో పుస్తకాలు కూడా ఇవ్వటం లేదని తెలుస్తోంది. అలాగే ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు కాకుండా వివిధ రకాల కోర్సుల పేరుతో ఫీజులు దండుకుంటున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేట్ ఇష్టారాజ్యం

కదిరి మున్సిపాలిటీ పరిధిలోని కార్పొరేటు స్కూల్స్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ఇష్టారాజ్యంగా తయారైంది. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వారి ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. నర్సరీ నుంచి పై తరగతులకు ముందస్తు అడ్మిషన్లకు తెరలేపి. పిల్లల తల్లిదండ్రుల నుండి అందిన కాడికి దండుకుంటున్నాయి. కేవలం నర్సరీకే రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకూ ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నాయి. స్కూల్ యూనిఫాం, పుస్తకాలకు ఓ స్థాయిలో డబ్బులు దండుకుంటున్నాయి. వీటన్నింటినీ ముడిపెట్టి ముందుగానే సగం ఫీజు చెల్లిస్తేనే పుస్తకాలు ఇస్తామని చెబుతున్నట్లు సమాచారం. నర్సరీ ఆపై తరగతుల విద్యార్థులకు భారీ మొత్తంలో ఫీజును నిర్ణయించి నిర్దాక్షిణ్యంగా ముక్కుపిండి ముందస్తుగానే వసూలు చేసేస్తున్నాయి. నిబంధనలను

సగం ఫీజు చెల్లిస్తేనే పుస్తకాల పంపిణీ

నిబంధనలకు విరుద్ధంగా మే మొదటి వారంలోనే వేసవి సెలవులు కొనసాగుతుండగానే కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు జరుగుతున్నాయి. సగం ఫీజు వసూలు చెల్లిస్తేనే పుస్తకాలు పంపిణీ చేస్తామని చెబుతున్నారు. ఫీజు చెల్లించుకోకుంటే అడ్డమైన నిబంధనలు చెప్పి 'మళ్ళీ రండి' అని విద్యార్థుల తల్లిదండ్రులను పంపించేస్తున్నాయి. పాఠశాలల ముందు నో అడ్మిషన్ బోర్డు ఏర్పాటు చేసి పాఠశాలలో మాత్రం యథేచ్ఛగా అడ్మిషన్లు చేపడుతున్నట్లు విమర్శలున్నాయి.

కనిపించని నోటీసు బోర్డు.

విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని కార్పొరేట్, ప్రైవేట్ వైపు మొగ్గుచూపుతున్నారు. దీని ఆసరాగా తీసుకున్న కార్పొరేట్, ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలు నిబంధనలకు నీళ్లొదిలేశాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలల్లో విద్యా సంవత్సరానికి తాము వసూలు చేసే ఫీజు వివరాలను తరగతుల వారీగా నోటీసు బోర్డులో ఉంచాలి. కానీ, ఈ నిబంధనలు అమలవుతున్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు.

మొద్దు నిద్రలో విద్యాశాఖ అధికారులు

మున్సిపాలిటీ పరిధిలో వాల్మీకి ప్రయవేటు పాఠశాల యాజమాన్యం ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ తల్లిదండ్రులను నిట్ట నిలువున ముంచేస్తున్న విద్యాశాఖ అధికారులు మాత్రం మొద్దు నిద్రలో జోగుతున్నారన్న ఆరోపణాలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నత అధికారులు స్పందించి అక్రమ అడ్మిషన్లు కొనసాగిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిందే..

విద్యాశాఖ నిబంధనలకు తిలోదకాలిస్తూ ముందుస్తు అడ్మిషన్లు కొనసాగిస్తూ తల్లిదండ్రుల నుండి ఫీజులు దోపిడీకి పాల్పడుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంలో అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు కొనసాగుతున్నప్పటికీ మే మాసం నుండి ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించిన పాఠశాలల పై చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ స్పందించాలి. మండల విద్యాశాఖ అధికారులు మొద్దు నిద్ర విడి ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నరసింహ
విద్యార్థిసంఘం నాయకులు, కదిరి

చర్యలు తీసుకుంటాం

ప్రస్తుతం వేసవి సెలవులు కొనసాగుతున్నాయి. జూన్ 12 వరకు స్కూళ్లకు వేసవి సెలవులు. అప్పటివరకు ఎలాంటి అడ్మిషన్లు చేపట్టరాదు. విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా కదిరి పట్టణంలో ముందస్తు అడ్మిషన్లు చేపట్టినా, పుస్తకాలు విక్రయించిన అటువంటి పాఠశాలలపై సంబంధిత విద్యాశాఖ అధికారిని పంపించి చర్యలు తీసుకుంటాం

క్రిష్టప్ప
జిల్లా విద్యాశాఖ అధికారి
శ్రీ సత్య సాయి జిల్లా

నేడు షైనింగ్ స్టార్ అవార్డుల ప్రదానోత్సవం

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - కొత్తచెరువు

ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం కోసమే ప్రభుత్వం షైనింగ్ స్టార్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు శ్రీ సత్య సాయి జిల్లా కొత్తచెరువు మండల పరిధిలోని మైలేపల్లి చెరువు సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మి వెంకటేశ్వర కళ్యాణమండపంలో సోమవారం షైనింగ్ స్టార్ అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ ఏర్పాట్లను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జిల్లాలో మొత్తం పదో తరగతిలో 187, ఇంటర్మీడియట్లో 38 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. పదవ తరగతిలో500 మార్కులు పైబడిన విద్యార్థులలో మండలానికి ఆరుగురు చొప్పున విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్, చెక్కు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు జిల్లాలో టాప్ త్రీ నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సవహించడానికి ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ అవార్డుల ప్రధానోత్సవం కార్యక్రమంలో ఇన్‌ఛార్జి మంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొననున్నారని చెప్పారు.

యువతి దారుణహత్య

నాలుగు రోజుల క్రితం అదృశ్యమైనట్టు ఫిర్యాదు

శవమై లభించిన యువతి

పోలీసుల నిర్లక్ష్యంతోనే ఈ ఘటన అని తల్లిదండ్రుల ఆరోపణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదు. సత్యసాయి జిల్లా రామగిరి మండలంలో మైనర్ బాలికను అత్యాచార ఘటన మరువక ముందే అనంతపురం జిల్లాలో యువతిని దారుణంగా హత్య చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. యువతి అదృశ్యమై నాలుగు రోజులైందని తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా పోలీసులు సకాలంలో స్పందించకపోవడంతోనే తమ కుతురు చనిపోయిందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు మాత్రం ఫిర్యాదు అందిన వెంటనే స్పందించామని చెబుతున్నారు. ఇదిలాగుండగా యువతి హత్యకు సంబంధించి ఆమె తండ్రి లక్ష్మిపతి తెలిపిన సమాచారం మేరకు పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం నగరంలోని రామకృష్ణ కాలనీలో నివాసముంటున్న లక్ష్మిపతి కుమార్తె తన్మయి (17) ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మంగళవారం సాయంత్రం నుంచి తన్మయి కనిపించకపోవడంతో అనంతపురం నగరంలో ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారిస్తున్నామని బెబుతున్నారే తప్ప ఎక్కడికెళ్లిందని గుర్తించలేదు. ఆదివారం మధ్యాహ్నం కూడేరు మండలం పరిధిలోని మణిపాల్ విద్యా సంస్థల వెనుకాలకాలిపోయి, సగం కుల్లిపోయివున్న యువతి మృతదేహం లభించింది. అది అదృశ్యమైన తన్మయిదేనా కాదా అన్నది గుర్తించాలని కూడేరు పోలీసుల నుంచి తన్మయి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆ సమాచారం అందుకున్న వారు అక్కడకెళ్లి పరిశీలించి చనిపోయింది తమ కుమర్తెనని గుర్తించారు. నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన తన్మయి శవమై కనిపించిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కూడేరు మండల పరిధిలో లభ్యమైన తన్మయి మృతదేహం

పోలీసులు అనుమానితులకు ప్రశ్నించి ఉంటే

తమ కుమార్తె అదృశ్యమైన రోజే పోలీసులకు ఫిర్యాదు చేసామని తన్మయి తల్లిదండ్రులు చెబుతున్నారు. అనుమానితులుగానున్న వారి ఫోన్ నంబర్లు కూడా ఇచ్చామని చెప్పారు. అయితే అనుమానితుల పేర్లను విచారించి వారికి సంబంధం లేదని పోలీసులు వదిలేసారని ఆరోపిస్తున్నారు. ఆరోజే స్పందించి తగిన చర్యలు తీసుకుని ఉంటే తమ కుమార్తె బతికేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిందితుల కోసం గాలింపు ?

అదృశ్యమైన యువతి శవమై కనిపించడంతో పోలీసు యంత్రాంగం నిందితుల కోసం గాలింపు చేపడుతోంది. అదృశ్యమైన రోజు యువతితో మాట్లాడిన వారితోపాటు, ఎవరు ఈ హత్యకు కారణమై ఉంటారన్నది గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.

నేడు మహిళా కమిషన్ సభ్యురాలు రాక

సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాల పల్లిలో మైనర్ బాలిక అత్యాచార బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఎపి మహిళా కమిషన్ సభ్యులు డాక్టర్ షేక్ రుఖీయా బేగం జిల్లాకు రానున్నారు. బెంగళూరున ఉంచి వస్తున్న ఆమె మొదట బాలిక కుటుంబాన్ని పరామర్శిస్తారు. అనంతరం రామగిరి సర్కిల్ పోలీసుస్టేషన్ సందర్శించి వివరాలు తెలుసుకుంటారు. అనంతరం పుట్టపర్తికెళ్లి జిల్లా ఎస్పీని కలసి కేసు పురోగతికి సంబంధించి పూర్వాపరాలు తెలుసుకుంటారు. అనంతరం తిరుగు ప్రయాణమై బెంగళూరుకు వెళతారు.

10న పుట్టపర్తికి వైఎస్. షర్మిల రాక

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఏపీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల పుట్టపర్తికి ఈనెల 10న రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 10న స్థానిక సాయి ఆరామం అతిథిగృహంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ఇనయతుల్లా ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కాంగ్రెస్ పార్టీ సమావేశంలో షర్మిల పాల్గొంటారన్నారు. సమావేశంలో పార్టీ బలోపేతానికి చేపట్టవలసిన చర్యలు, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ అనుసరించాల్సిన విధివిధానాలు, గ్రామస్థాయి, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలు తదితర అంశాలపై విస్తృతస్థాయి చర్చలు జరిపి, పార్టీ నిర్మాణాలపై దిశ దశ నిర్దేశిస్తారన్నారు. జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇంటికి వేసిన తాళాలు తొలగింపు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం గొళాపురం గ్రామంలో 5 సంవత్సరాల క్రితం మృతి చెందిన దళిత హనుమప్ప తన వద్ద రూ.50వేలు అప్పుగా తీసకున్నాడని ఆరోపిస్తూ అప్పలకుంటకు చెందిన అంజక్క, ఆమె కుమారుడు సుధాకర్ తరచు వేదించడంతో పాటు గంగమ్మ నివాసం ఉంటున్న ఇంటికి తాళం వేసి వారిని ఇంటి బయటకు పంపారు. గంగమ్మ ఎదుర్కొంటున్న సమస్యను కథనం రూపంలో ప్రజాశక్తి వెలుగులోకి తీసుకొచ్చింది. దీనిపై అప్‌గ్రేడ్ స్టేషన్ సిఐ ఆంజినేయులు స్పందించారు. ఇరు గ్రామాల్లో విచారణ చేసి, గంగమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో పోలీసులు విచారణ జరిపి గోళాపురం గ్రామస్తుల సమక్షంలో తాళం వేసిన గంగమ్మ ఇంటిని తెరిపించి, బాధితులను ఇంటిలోకి ప్రవేశింపజేశారు. దీంతో పాటు ఏలాంటి ఆధారం లేకుండా అంజక్క ఆమె కుమారుడు వచ్చి డబ్బులు ఇమ్మని వేధిస్తే తమ దృష్టికి తీసుకు రావాలని గంగమ్మకు సూచించారు. పోలీసులు తీసుకున్న చర్యలకు గ్రామస్తులు అభినందించారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

డీఈవో కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి అనంతపురం సిటీ

ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న పదోన్నతులు మరియు బదిలీలలో ప్రభుత్వం తాను ఇచ్చిన హామీకి వ్యతిరేకంగా జరిపిస్తోందని ఉమ్మడి జిల్లాల ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని డీఈవోకార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఐక్య ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ గత నెల 19, 20 తేదీలలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో ప్రభుత్వం చేసిన చర్చల సందర్భంగా ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా వెబ్ కౌన్సిలింగ్ విధానాన్ని అమలు చేయడానికి నిర్ణయించారని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వెబ్ కౌన్సిలింగ్ అంగీకరించేది లేదని మాన్యువల్ కౌన్సిలింగ్ వచ్చేవరకు ఎన్ని రోజులైనా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు స్పందిస్తూ ఉపాధ్యాయులను ఉద్దేశించి తమ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు లింగమయ్య ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు జయ చంద్రారెడ్డి, సుధాకర్, ఏపీ వైఎస్ఆర్‌టిఎ నాయకులు నాగిరెడ్డి, శ్రీధర్ గౌడ్, ఏపీపీటీఎ గోపాల్ రెడ్డి, వెంకటరత్నం, ఎస్‌టియు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, హరి ప్రసాద్ రెడ్డి, ఏపీయుఎస్ ఎర్రిస్వామి, ఏపీటీఎఫ్ వెంకటేశులు, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయసంఘాల నాయకులతో మాట్లాడుతున్న అనంతపురం డిఇఒ

మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి

హిందూపురం : ప్రాథమిక పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయులకు మ్యానువల్‌గా బదిలీలు నిర్వహించాలని హిందూపురం ఉపాధ్యాయ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద నిరసన తెలిపి మండల విద్యాశాఖాధికారి గంగప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో 2వేల నుంచి 3వేల వరకు పాఠశాలలను ఎంపిక చేసుకోవడం కష్టమైనదని, దీని ద్వారా ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందని న్నారు. ప్రత్యక్షంగా ఖాళీలను ఎంపిక చేసుకోవడం సులభతరమైన పని అన్నారు. ప్రభుత్వం వెంటనే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రత్యక్ష పద్ధతిలోనే బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు అంజనమూర్తి, నాగరాజు, నారాయణస్వామి, గురురాజారావు, సలీం బాష, షామీర్ బాష, మధుసూదన్‌రెడ్డి, గోపాల్ నాయక్, మోహన్ కుమార్, ఆంజనేయులు, నరసింహమూర్తి, రవీంద్ర, చెన్నకేశవులు, అనిల్కుమార్, మల్లికార్జున, శివ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల ద్వారా మెరుగైన సేవలు

సహకార శాఖ జిల్లా అధికారి కృష్ణానాయక్

ప్రజాశక్తి- పుట్టపర్తి అర్బన్

రైతుల సంక్షేమానికి వారి అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నేతత్వంలో ప్రాథమిక సహకార పరపతి సంఘాల ద్వారా మెరుగైన సేవలు అందించడానికి కషి చేస్తున్నామని జిల్లా సహకార శాఖ అధికారి కష్ణనాయక్ తెలిపారు. కేవలం రైతుల అభివృద్ధి కోసమే ప్రాథమిక సహకార సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాదాపు 75 ఏళ్ల క్రితమే ఈ సంఘాలను (సొసైటీ) ప్రభుత్వం ఏర్పాటు చేసి రైతులకు రుణ సదుపాయాలు కల్పిస్తోంది. ఆయా సంఘాల నుంచి ఐదు వేల మంది సభ్యులుగా ఉంటారు. ఆ సంఘాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరాలతో పాటు రబీ, ఖరీఫ్ సీజన్లో అవసరమైన వారికి రుణ సదుపాయాలు కూడా కల్పిస్తారు. ఆయా సంఘాలకు కేవలం రైతుల ద్వారానే అధ్యక్షులు, డైరెక్టర్లను ఎన్నికల ద్వారా ఎన్నుకుంటారు. ఈ పాలకవర్గం రైతుల అభ్యున్నతికి కషి చేస్తుంది. పంటల పెట్టుబడికి, వ్యవసాయానికి ఆ సంఘాలు రుణాలు అందిస్తాయి. చాలామంది రైతులు ఈ సంఘాల ద్వారానే రుణాలు పొందుతారు. కొన్ని సంఘాల ఆధ్వర్యంలో సహకార బ్యాంకులు ఏర్పడ్డాయి. పాలకవర్గం సిఫారసుతో సహకార బ్యాంకులో రుణాలు అందిస్తారు. అతివృష్టి, అనావృష్టితో ఇబ్బందులను ఎదుర్కొంటున్న రైతుల కోసం మరిన్ని సేవలు అందించడానికి కంప్యూటరైజేషన్ చేపట్టారు. దీంతో ఇకపై ఆన్ లైన్ ద్వారా సేవలు అందించవచ్చు. ఉమ్మడి వ్యవసాయం, ఉమ్మడి వ్యాపారాలను రైతులు చేసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో రైతులకు అందిస్తున్న సేవలపై జిల్లా

సహకార శాఖ అధికారి కష్ణనాయక్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి? ఎంతమంది సభ్యులు ఉన్నారు?

జవాబు: జిల్లాలో 54 ప్రాథమిక సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. అందులో 1.96 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. రైతులందరితో ఈ కేవైసీ చేయించి కంప్యూటరీకరణ చేశాం. దీంతో రైతులకు ఆన్ లైన్ ద్వారా మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది.

ప్ర: రైతులకు సంఘాల ద్వారా అందిస్తున్న సేవలు వివరించండి?

జ : రైతులకు గతం నుంచి పంట పెట్టుబడికి, వ్యవసాయానికి అవసరమైన రుణాలు అందిస్తున్నాము ప్రస్తుతం ఉమ్మడిగాను, వ్యక్తిగతంగా కూడా రైతుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నాం. ఉమ్మడి వ్యాపారాలు చేసుకునే రైతులకు ఉపయోగపడే విధంగా సహకారం అందించడం జరుగుతుంది. ఉమ్మడిగా ఎరువులు అమ్మకం, పాల డైరీ, పాల ఉత్పత్తులు, పాడి పశువులు, ట్రాక్టర్లు, గ్యాస్ కనెక్షన్, పెట్రోల్ బంక్ నిర్వహణ, పచ్చి గడ్డి పెంపెకం తదితర 25 రకాల వ్యాపారాలు నిర్వహించుకుని అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పిస్తున్నాం.

ప్ర: రైతుల ఉమ్మడి వ్యాపారాలకు విధానాలు ఏమిటి?

జ: సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న రైతులు ఉమ్మడిగా రైతులకు సంబంధించిన వ్యాపారాలు చేపట్టవచ్చు. ఈ విధంగా జిల్లాలో ఇప్పటికే 18 సంఘాలు పనిచేస్తున్నాయి. ఈ వ్యాపారాలు చేపట్టడానికి రైతులు రూ.25 లక్షలు పెట్టుబడి పెడితే ప్రభుత్వం మరో రూ. 25 లక్షలు సమకూర్చుతుంది. ఇప్పటికే సోమందేపల్లి, బండ్లపల్లి సొసైటీలలో వ్యాపారాలు జరుగుతున్నాయి. వారి వివరాలు అన్ని కంప్యూటర్లో నిక్షిప్తమయ్యాయి. త్వరలోనే మిగిలిన సంఘాలకు కూడా కంప్యూటరీకరణ పూర్తి అవుతుంది. దీంతో మొత్తం వ్యవహారాలన్నీ ఇకపై ఆన్లైన్ ద్వారా జరుగుతాయి. రైతులకు ఉపయోగపడే విధంగా సేవలు కొనసాగుతాయి. వ్యాపార నిర్వహణలో అవసరమైన శిక్షణను కూడా రైతులకు ఇవ్వడం జరుగుతుంది. రైతులకు ఉమ్మడి వ్యాపారాలలో వచ్చే ఆదాయం సమంగా పంచుకోవచ్చు. ప్రభుత్వం అందించే రాయితీలు కూడా రైతులు పొందే అవకాశం ఉంటుంది.

ప్ర: రైతులకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

జ : ఉమ్మడిగా లేదా వ్యక్తిగతంగా రైతులకు ఉపయోగపడే వ్యాపారాలు నిర్వహించుకోవచ్చు. సంఘాలలో ఉన్న రైతులు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలి. తద్వారా మరికొన్ని సంఘాలకు రుణ సౌకర్యం కల్పించడానికి అవకాశం ఉంది. మొండి బకాయిల స్థాయికి చేరకుండా సక్రమంగా వ్యాపారాలు నిర్వహించుకోవాలి. తద్వారా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. ఆయా వ్యాపారాల పర్యవేక్షణ ఆయా సంఘాల అధికారులు చూస్తుంటారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

సహకారశాఖ జిల్లా అధికారి కృష్ణానాయక్

మడకశిర బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కరువు

ప్రజాశక్తి-మడకశిర రూరల్

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఎలాంటి షెల్టర్ లేకపోవడంతో ఎండకు ఎండాల్సిందే.. వానకు తడవాల్సిందేనని ప్రమాణికులు వాపోతున్నారు. నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం వేలాది మంది ప్రజలు నిత్యం ఆర్టీసీ బస్సుల ద్వారా మడకశిర పట్టణం వస్తుంటారు. ఈ క్రమంలో రాకపోకల నేపథ్యంలో బస్సుల కోసం బస్టాండ్‌లో వేచి ఉంటారు. అయితే కనీసం బస్ షెల్టర్, తాగునీరు, మరుగుదొడ్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌లో షెల్టర్‌తో పాటు కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఈ నెల 12వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలలు పున:ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అవసరమైన పాఠ్యపుస్తకాలను ఆయా మండలాలకు చేర్చినట్లు తెలుస్తోంది. ఏకరూప దుస్తులు కూడా అందించడానికి సన్నాహాలు చేస్తుంది. పాఠశాలలు తెరిచే సమయానికి బ్యాగులు, దుస్తులు, బూట్లు, బెల్టులతో కూడిన కిట్లను (సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు) పంపిణీ చేయడానికి సర్వం సిద్ధం చేసుకోవాలని ఇప్పటికే సంబంధిత విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. కొన్ని మండలాలకు నోటు పుస్తకాలు కూడా అందినట్లు అధికారులు తెలిపారు. కదిరి నియోజకవర్గంలోని తలుపుల మండలంలో మొత్తం 2,753 విద్యార్థులు మంది ఉండగా అవసరమైన పాఠ్య, నోటు పుస్తకాలు వచ్చాయని, ఇంకా కొన్ని బ్యాగులు, బెల్టులు రావాల్సి ఉందని ఎంఇఒ వెంకట్రాముడు తెలిపారు. తనకల్లు మండలంలో 3,260 మంది విద్యార్థులు ఉండగా పాఠ్య, నోటు పుస్తకాలు, బూట్లు వచ్చాయని బ్యాగులు, బెల్టులు రావాల్సి ఉందని ఎంఇఒ లలితమ్మ తెలిపారు. వచ్చినవన్నీ ఇప్పటికే పాఠశాలలకు సరఫరా చేసినట్లు తెలిపారు. నల్లచెరువు మండలంలో 2,348 విద్యార్థులు ఉండగా ఇప్పటికే అన్ని పాఠశాలలకు పంపామని, బ్యాగులు రావాల్సి ఉందని ఎంఇఒ తిరుపాల్ నాయక్ తెలిపారు. కదిరి రూరల్, మున్సిపాలిటీలో 8,783 మంది విద్యార్థులు ఉండగా వచ్చిన పాఠ్య, నోటు పుస్తకాలు, ఇతర వస్తువులు పాఠశాలలకు చేర్చామని ఎంఇఒ-2 ఓబుల్‌రెడ్డి తెలిపారు. గాండ్లపెంట మండలంలో 2,196 మంది విద్యార్థులు ఉండగా పాఠ్య, నోటు పుస్తకాలు, డిక్షనరీలు ఇప్పటికే పాఠశాలలకు చేర్చినట్లు ఎంఇఒలు కృష్ణ,శ్రీనివాసులు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా కొన్ని మండలాలకు బూట్లు, బ్యాగులు, బెల్టులు రావాల్సి ఉందని ఎంఇఒలు తెలిపారు. నియోజకవర్గంలోని మండలాల్లో మొత్తం 21,946 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వీరికి మెరుగైన విద్యనందించేందుకు కూటమి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు విద్యా శాఖ అధికారులు తెలిపారు.

ఎంఇఒ కార్యాలయం నుంచి తరలిస్తున్న పాఠ్యపుస్తకాలు


ప్రభుత్వ పాఠశాలకు చేరిన పుస్తకాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి..

మరో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని ఎదురుదోన పంచాయతీ పరిధిలోని ముక్కంవారిపల్లి గ్రామ సమీపంలో క్వాలిస్ వాహనం ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. తనకల్లు మండలంలోని మారెప్పగారిపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై తిమ్మమ్మ మర్రిమానుకు వస్తుండగా ముక్కంవారిపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న క్వాలిస్ వాహనాన్ని వీరిని ఢీ కొంది. ఈ ప్రమాదంలో షేక్ మహమ్మద్ సోహేల్(15) అక్కడికక్కడే మృతి చెందగా మహమ్మద్ లతీఫ్, తౌసీఫ్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి క్షతగాత్రులను 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ కిషోర్‌రెడ్డి తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-బత్తలపల్లి

శ్రీరాములు(ఫైల్‌ఫోటో)

జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం బత్తలపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన కాటమయ్య కుమారుడు సిరప్పగారి శ్రీరాములు(41) పదేళ్ల క్రితం స్వగ్రామమైన ఈదుల ముష్టూరులో తెలిసిన వ్యక్తుల వద్ద సుమారు రూ. 12 లక్షలు దాకా అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చలేక రుణ దాతలకు కోర్టు ద్వారా ఐపీ నోటీసులు సైతం పంపాడు. అప్పులు కట్టలేక, అవమాన భారంతో గ్రామంలో ఉండలేక పదేళ్ల క్రితం స్వగ్రామం వదిలి చెన్నైకి వెళ్లి అక్కడే కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. ఐదు నెలల క్రితం చెన్నై నుంచి తిరిగి వచ్చి బత్తలపల్లిలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న బీసీ కాలనీలో భార్య రామాంజనమ్మ, ఇద్దరు కుమారులు శివాంజనేయులు, రాకేష్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. ఇటీవల అతడు మద్యానికి బానిసయ్యాడు. తరచూ మద్యం తాగి వచ్చి నేను అప్పులు తీర్చలేను, అప్పు ఇచ్చిన వారికి మొహం ఎలా చూపించాలని భార్యతో చెప్పి బాధపడేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి రామాంజనమ్మ తన ఇద్దరు కుమారులతో కలిసి మిద్దెపై నిద్రిస్తుండగా శ్రీరాములు ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

టిడిపి కార్యకర్తల కుటుంబాలకు 'పల్లె' ఆర్థికసాయం

ప్రజాశక్తి-నల్లమాడ

కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పల్లె

మండలంలోని ఎనుములవారిపల్లిలో గంతి గంగాద్రి(35) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి ఆ గ్రామం వెళ్లి గంగాద్రి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేలు అందజేశారు. ఆయన వెంట పి.గంగాద్రి, అంజిబాబు, కె.మల్లికార్జున, రమణ, జనార్ధన్, పి.కుటాల సూరి, నాగేంద్ర, శ్రీరాములు, శంకర్, చంద్రారెడ్డి ఉన్నారు. అలాగే మండలంలోని దొన్నికోట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త వై.సోమశేఖర్‌నాయుడు(30) ఇటీవల కారు ప్రమాదంలో మృతి చెందగా పల్లె ఆ గ్రామం వెళ్లి సోమశేఖర్ కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేలు అందజేశారు. పల్లె వెంట డాక్టర్ నాగభూషణంనాయుడు, మంజురెడ్డి, పెద్దప్పనాయుడు, గంగులప్పనాయుడు, వెంకటరమప్పనాయుడు, ప్రసాద్‌నాయుడు, వెంకటరమణ నాయుడు, ఎం.రవికుమార్, కొండ్రెడ్డి బయారెడ్డి, సి.చంద్ర, సుబ్బరాయుడు, వి.కిష్టప్ప ఉన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణమే జెవివి సంకల్పం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

శాస్త్రీయ సమాజ నిర్మాణమే జన విజ్ఞాన వేదిక(జెవివి) సంకల్పమని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, కోశాధికారి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. వారు ఆదివారం ప్రముఖ చిన్నపిల్లల వైదుడు డాక్టర్ విక్రాంత్, హెచ్ఎం భాస్కర్‌బాబుతో కలిసి పట్టణంలోని జగ్జీవన్‌నగర్‌లోని శ్రీసత్య చిన్నపిల్లల హాస్పిటల్ దగ్గర జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ గోడ పత్రికలు విడుదల చేశారు. వారు మట్లాడుతూ జెవివి 38 ఏళ్లుగా తెలుగు ప్రజలతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తుందన్నారు. ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలని, మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ శాస్త్ర ప్రచారంతో ప్రజలను చైతన్యం చేస్తోందన్నారు. నేడు ధర్మం, అధర్మం మధ్య, సత్యం, అసత్యం మధ్య ఘర్షణ జరుగుతోందన్నారు. ఈ ఘర్షణలో బుద్ధి జీవులు ఏ పక్షం వహించాలో ప్రత్యేకించి చెప్పనవసరం లేదన్నారు. చివరకు జ్ఞానం అజ్ఞానాన్ని, సత్యం అసత్యాన్ని తప్పక జయిస్తాయని వందేళ్ల క్రితమే కందుకూరి వీరేశలింగం పంతులు అన్నారన్నారు. జీవుల జన్యు నిర్మాణం, రోగాలు, వాటికి చికిత్సలో ఎంతో ముందుకెళ్లాం కానీ ఇంకా సమాజంలో అశాస్త్రీయ భావజాలం రాజ్యమేలుతూనే ఉందన్నారు. అందుకు సైన్స్ అందిస్తున్న ఫలితాలు సామాన్యుని వద్దకు చేరకపోవడమే కారణమన్నారు. సైన్స్ ఇప్పటికీ పాఠ్య గ్రంథాల్లో ఉంది తప్ప జీవన విధానంగా మారలేదన్నారు. సైన్స్‌పై అవగాహన పెంచడం ద్వారా సామాన్యులు సైన్స్ ఫలితాలను అందుకోవాలనే ఆలోచనతో జెవివి ఏర్పడిందన్నారు. మనం చేసే శాస్త్రీయ ఆలోచన క్రమాన్ని ఆటంకపరిచే, అడ్డుకునే శక్తులు సామాజిక వ్యవస్థలో ఉన్నాయన్నారు. అలాంటి హేతు విరుద్ధ శక్తుల పట్ల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేసే కర్తవ్యం జెవివి చేస్తుందన్నారు. అక్షరాస్యత, సారా వ్యతిరేక ఉద్యమం, కూల్ డ్రింక్స్‌పై వ్యతిరేక ప్రచారం, ఆరోగ్య ప్రచారం, పిల్లల్లో సృజనాత్మకత కోసం ప్రయత్నాలు, పర్యావరణం వంటి అంశాలతో పాటు పిల్లలకు సైన్స్ పట్ల అభిరుచి పెంచేందుకు చెకుముకి పత్రికను నిర్వహిస్తుందన్నారు. ఉన్నతమైన శాస్త్రీయ సమాజ కోసం ప్రజాసైన్స్ ఉద్యమానికి తోడ్పాటు అందించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో జెవివి నాయకులు సురేష్, నరేంద్రబాబు, నాగేంద్ర, ఖలందర్, మల్లికార్జున, మనోహర్, జంగమన్న, వినయ్ పాల్గొన్నారు.

జెవివి సభ్యత్వ గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

నేడు మార్కెట్ యార్డ్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

మడకశిర : స్థానిక హిందూపురం రోడ్డులోని మార్కెట్ యార్డులో సోమవారం జరిగే యార్డ్ ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు చురగ్గా సాగుతున్నాయి. ఏర్పాట్లను ఆదివారం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బిఎస్.గురుమూర్తి, అగళి జడ్పిటిసి ఉమేష్, జిల్లా తెలుగు యువత కార్యదర్శి మారుతిప్రసాద్, జికె. ఈరన్న, రామకృష్ణ, భరత్, తిప్పేస్వామి, శివన్న పర్యవేక్షించారు. మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో జరుగుతుందని, నియోజకవర్గంలోని కూటమి నాయకులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.

గుడిబండ : మడకశిరలో సోమవారం జరిగే వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యమ్రానికి మండలం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప పిలుపునిచ్చారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

పుట్టపర్తి రూరల్ : నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని ఎస్పీ వి.రత్న రౌడీషీటర్లకు సూచించారు. జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం పోలీసు అధికారులు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలలో రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇకపై సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కావున వాటికి స్వస్తి పలికి ప్రశాంతమైన జీవితం గడపాలని హెచ్చరించారు.

యోగాతో ఆరోగ్యాన్ని కాపాడుకోండి

మడకశిర : సమాజంలో ప్రతి ఒక్కరూ యోగా అలవాటు చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డిఆర్‌డిఎ పిడి కెఎన్.నరసయ్య, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని జ్యోతిరావు పూలే విగ్రహం సమీపంలో వడిసిలమ్మ దేవాలయం, అమరాపురం బస్టాండ్‌ఓ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమం లో తహశీల్దార్ కరుణాకర్, ఎంపీడీవో సోనియాబాయి, సిఐలు రాజ్‌కుమార్, సురేష్ బాబు, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు రాజు, ఉమా శంకర్, ఉపాధ్యాయులు ఉమేష్, శ్రీనివాస్, నాగరాజు, కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

యోగాసనాలు వేస్తున్న నాయకులు, అధికారులు

శిబిరం నిర్వహణకు సహకరించిన వారిని సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడమే రోటరీ క్లబ్ ప్రధాన లక్ష్యమని క్లబ్ అధ్యక్షుడు జయసింహా, కోశాధికారి సుదర్శన్‌గుప్తా, క్యాంపు ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జయసింహా, సుదర్శన్‌గుప్తా మాట్లాడుతూ రోటరీ క్లబ్, శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఈ శిబిరం నిర్వహించామన్నారు. అనంతపురం నగరానికి చెందిన అన్నపూర్ణ రెడీ మిక్స్ కాంక్రీట్ యజమాని చంద్రశేఖర్ ఆర్థిక సహకారం అందించారని తెలిపారు. శిబిరంలో 175 మందికి కంటి వైద్య చికిత్స చేసి 136 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకూ 35వేల మందికి ఆపరేషన్లతో పాటు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశామని తెలిపారు. అనంతరం వైద్యులు ఆపరేషన్ ముందు, తర్వాత పాటించాల్సిన నియమాలు, సూచనలను తెలిపారు. శిబిరంలో నరేందర్‌రెడ్డి, శివయ్య, రమేష్‌బాబు, కొండయ్య, సత్రశాల ప్రసన్నకుమార్, మనోహర్‌గుప్తా, కృష్ణమూర్తి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై నేడు ర్యాలీలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు డిఆర్‌డిఎ పీడీ నరసయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని సచివాలయాలు, మండల కేంద్రాల్లో ర్యాలీలు జరుగుతాయన్నారు. అలాగే పట్టణంలో హనుమాన్ సర్కిల్ నుంచి వై జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు ర్యాలీ, 9 గంటల నుంచి ఆర్‌కె బీచ్ చిత్రావతి రహదారిలో యోగాపై వ్యాసరచనల పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల సచివాలయాల సిబ్బంది, అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ధర్మవరంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

పాడి రైతులకు అవగాహన

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పంటల సాగులో మెలకువలు, యాజమాన్య పద్ధతులు, పాడి పశువుల పెంపకం, పాల దిగుబడి పెంపుపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని చింతలపల్లి, గొట్లూరు గ్రామాల్లో ఆదివారం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన శాస్త్రవేత్త జాహ్నవి వేరుశనగ, కంది, శెనగ, బత్తాయి పంటలకు సోకే చీడ పీడలు, సస్యరక్షణ చర్యలు, నీటి యాజమాన్యం గురించి వివరించారు. బి.చందన రెడ్డిపల్లి కెవికె అందిస్తున్న సేవలు, విత్తనాల లభ్యత, డ్రోన్ ద్వారా పిచికారి, తదితర అంశాలను తెలిపారు. డా. రఘుకరన్ కోళ్ళు, పొట్టేళ్ల యాజమాన్య పద్ధతులను వివరించారు. వెటర్నరీ డాక్టర్ శేఖర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ముస్తఫా మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలని సూచించారు. ఉద్యానవన అధికారిణి అమరేశ్వరీ ఉద్యానవన పథకాలు, చీడపీడలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ధర్మవరం క్లస్టర్ ఇన్‌ఛార్జి చింతలపల్లి మహేష్‌నాయుడు, నీటి సంఘాల ప్రెసిడెంట్ కాటమయ్య, జాహ్నవి, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : వ్యవసాయ రంగాన్ని శాస్త్రీయంగా అభివృద్ధి పరచడమే వికసిత కృషి సంకల్ప అభియాన్ ఉద్దేశమని రెడ్డిపల్లి కెవికె శాస్త్రవేత్త డాక్టర్ త్రికల మాధవి, ఐసిఎఆర్ శాస్త్రవేత్త డాక్టర్ దురై మురుగన్, మడకశిర పశువైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శివకుమార్ తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన కార్యమ్రంలో వారు రైతులకు సేంద్రియ ఎరువులు, డ్రోన్ స్ప్రే, నూతన సాగు పద్ధతులు, వంగడాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వంశీకృష్ణ, పశువైద్యాధికారి డాక్టర్ పురుషోత్తంరెడ్డి, ఉద్యాన అధికారి మహేష్‌నాయక్, విస్తరణ అధికారి శ్రీవిద్య పాల్గొన్నారు.

పావగడలో వృథాగా వాల్మీకి భవన సముదాయం

ప్రజాశక్తి-పావగడ

మంచి ఆశయంతో పట్టణంలోని తుమకూరు రహదారి పక్కన నిర్మించిన వాల్మీకి సముదాయ భవనం అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎందుకూ పనికి రాకుండా వృథాగా పడి ఉందని వాల్మీకి సముదాయం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాల్మీకి భవన సముదాయంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. గతేడాది వాల్మీకి జయంతి ముందస్తు సమావేశంలో రాబోయే సంవత్సరం వాల్మీకి జయంతి సమయానికి సముదాయ భవనం సిద్ధం చేస్తామని హామీ ఇచ్చిన అధికారులు మిన్నకుండిపోవడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వాల్మీకి జయంతి నాటికైనా భవనం మరమ్మతు పూర్తి చేయాలని లేనిచో ముందస్తు సమావేశాన్ని బహిష్కరిస్తామని హెచ్చరించారు. వాల్మీకి జయంతి కార్యక్రమంలో నల్ల దుస్తులు ధరించి హాజరు అవుతామని వారు స్పష్టం చేశారు.

బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎన్‌పి కుంట మండలంలోని తూర్పు నడింపల్లి, గౌకనపల్లి, కమ్మగుట్టపల్లి, ఎర్రగుడి ప్రాంతాల ప్రజల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చొరవతో ఆదివారం ఆర్టీసీ అధికారులు నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. నూతన బస్సు సర్వీసు సాయంత్రం 5 గంటలకు కదిరి నుంచి ఎన్‌పి.కుంట, తూర్పు నడింపల్లి, ఎర్రగుడి మీదుగా వేంపల్లికి వెళ్తుందన్నారు. అలాగే ఉదయం 4.45 గంటలకు వేంపల్లి నుంచి ఎర్రగుడి, తూర్పు నడింపల్లి, ఎన్‌పి.కుంట మీదుగా కదిరికి చేరుకుంటుందన్నారు. దీంతో టిడిపి నాయకులు కొట్టే మహేశ్వర్‌రెడ్డి, రామగంగిరెడ్డి, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేతో పాటు డిపో మేనేజర్ మొయిద్దీన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

నూతన బస్సు సర్వీసును ప్రారంభించిన ఆర్టీసీ అధికారులు

డాక్టర్‌పై దాడి.. కేసు నమోదు

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని శంకరగల్లు గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో వైద్యునిగా పని చేస్తున్న హెచ్.శ్రీనివాస్‌పై శనివారం గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ ఘటనకు సంబంధించి శ్రీనివాస్ తండ్రి హనుమంతరాయప్ప ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ.రాజాకుళ్లాయప్ప తెలిపారు. శ్రీనివాస్‌కు వారి బంధువైన తిమ్మప్పకు మధ్య ఫ్యామిలీ గొడవలు ఉన్నందున పదేళ్ల క్రితం గుడిబండ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. ఈ కేసుకు సంబంధించి మడకశిర కోర్టులో ట్రయల్ జరుగుతుందని శ్రీనివాస్ గత గురువారం స్వగ్రామమైన శంకరగల్లుకు వచ్చాడు. శుక్రవారం మడకశిర కోర్టులో హాజరయ్యాడు. ఆరోగ్యం సరిగాలేకపోవడంతో శనివారం ఉదయం బైక్‌పై మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకొని తిరిగి స్వగ్రామం వెళ్తుండగా రాళ్లపల్లి, గుర్రపుకొండ మధ్య బైక్‌పై వచ్చిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు శ్రీనివాస్ కళ్లల్లో కారం పొడి చల్లి ఐరన్ రాడ్లతో దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి రూరల్ మండలం కిరికెల పంచాయతీ మిట్టిమీదపల్లి గ్రామానికి చెందిన రైతు సురేష్‌కు చెందిన పాడి ఆవు మృతిచెందింది. గ్రామానికి చెందిన సురేష్ తనకు ఉన్న పాడి ఆవు ద్వారా లభించే పాలను అమ్ముకొని తన కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం తన ఆవును తీసుకొని గ్రామ శివారులో మేపడానికి వెళ్ళాడు. అదే ప్రాంతంలో విద్యుత్ తీగలు తెగి కిందకు పడ్డాయి. దానిని గమనించకుండా ఆవును మేత కోసం వదిలాడు. ఆ తీగలు తగలడంతో ఆవు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. తన కుటుంబజీవనాధారం అయిన ఆవు మృతిచెందడంతో ఆ ఆవు వద్ద సురేష్ తల్లి గంగమ్మ కూర్చొని రోధిస్తున్న దృశ్యం చూపరులను కలచివేసింది. ఈ విషయంపై బాధిత రైతు సురేష్ మాట్లాడుతూ రూ. 50 వేలు హెచ్చించి ఆవును కొనుగోలు చేశానని అన్నారు. రోజుకు 12 లీటర్ల పాలను అమ్ముకొని తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని అన్నారు. ఈ ఆవుద్వారా నెలకు దాదాపు రూ. 15వేలు ఆదాయం లభించేదన్నారు. విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి చెందడంతో ఆధారంతో పాటు ఆదాయం సైతం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే తమకు జీవనాధారమైన పాడి ఆవు మృతి చెందిందని. ప్రభుత్వం సహాయం అందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

భూసేకరణపై టేకులోడులో గ్రామసభ

ప్రజాశక్తి-చిలమత్తూరు

భూసేకరణ అంశంపై సోమవారం మండలంలోని టేకులోడు గ్రామ సచివాలయంలో ఉదయం 10 గంటలకు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్, పెనుకొండ ఆర్డీవో అధ్యక్షతన చిలమత్తూరు మండల తహశీల్దార్, విఆర్ఒ, సర్పంచి, ఇతర అధికారులు పాల్గొంటారన్నారు. ఎంపీ బికె.పార్థసారథి పరిశ్రమల కోసం ఈ ప్రాంతాన్ని పరిశీలించగా, రెవెన్యూ సిబ్బంది, అధికారులు గత వారం రోజులుగా భూ సర్వేను పూర్తిచేశారు. గత ప్రభుత్వం ఎకరాకు రూ. 25 లక్షలు ప్రకటించింది. కానీ కొనుగోలు చేయలేదు. ఇప్పుడు రూ. 30 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. గ్రామసభలో రైతుల అభిప్రాయాలు స్వీకరించి భూముల ధరలు నిర్ణయించనున్నారు. భూ సేకరణ జాబితాలో ఉన్న ప్రతి రైతు తప్పక హాజరుకావాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదుర్గాదేవి ప్రెస్ క్లబ్ నిర్మాణానికి లేపాక్షికి చెందిన ఈడిగ అంజనప్ప కుమారుడు టిడిపి నాయకుడు ఈడిగ రమేష్ ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులకు రూ. 50 వేలు విరాళం అందజేశారు. మరింత సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం ఆయనను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.


మండల కన్వీనర్ అభిలాష్‌ను సన్మానించిన మైదుగోళం నాయకులు

టిడిపి మండల కన్వీనర్‌కు సన్మానం

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని మైదుగోళం పంచాయతీలో స్థానిక టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘల నాయకులతో ఆ పార్టీ మండల కన్వీనర్ అభిలాష్ ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా మైదుగోళం టిడిపి నాయకులు నూతన మండల కన్వీనర్ అభిలాష్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు. అభిలాష్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. పార్టీ బలోపేతానికి అందరం కలిసి మెలిసి పని చేద్దామన్నారు. కార్యక్రమంలో మైదుగోళం సర్పంచి రామచంద్రరెడ్డి, ఖలీల్, మూర్తి, నాగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజధాని మహిళలను కించపరిచిన వారిని అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి-పెనుకొండ

రాజధాని అమరావతి మహిళలను కించపరిచేలా నీచంగా మాట్లాడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని నియోజకవర్గం తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. సాక్షి ఛానల్‌లో ప్రసారమైన ఓ చర్చా కార్యక్రమంలో కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు అమరావతి మహిళలను వేశ్యలని మాట్లాడిన నేపథ్యంలో తెలుగు మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు అనసూయమ్మ ఆధ్వర్యంలో తెలుగు మహిళలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆదివారం పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద సాక్షి దినపత్రిక ప్రతులు దహనం చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు సాక్షి ఛానల్ యాజమాన్యంపై ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. తెలుగు మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ మహిళలను అసభ్య పదజాలంతో మాట్లాడటం సిగ్గు చేటన్నారు. రాజధాని అమరావతి కోసం నాలుగేళ్లు అలుపెరగని పోరాటం చేసిన మహిళలను దూషిస్తారా అని ప్రశ్నించారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులను తిడితేనే అరెస్టులు చేస్తారా.? రాజధాని మహిళలను కించపరిచేలా మాట్లాడిన వారిని అరెస్టు చేయరా.? అని ప్రశ్నించారు. మున్ముందు ఇటువంటి వ్యాఖ్యలు ఎవరూ చేయకుండా మహిళలను కించపరిచిన కొమ్మినేని, కృష్ణంరాజులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, సాక్షి ఛానల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, పెనుకొండ, సోమందేపల్లి, రొద్దం, గోరంట్ల మండల కన్వీనర్లు ఈశ్వరప్రసాద్, వెంకటేశులు, నరహరి, బాలకృష్ణచౌదరి, పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములుయాదవ్, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, బాబుల్‌రెడ్డి, మాజీ సర్పంచి సూర్యనారాయణ, త్రివేంద్రనాయుడు, కృష్ణమూర్తి, షౌకత్, మహిళా నాయకురాలు చంద్రకాంతమ్మ, నారాయణనాయక్, కూటమి నాయకులు రామకృష్ణ, అంగడి రామాంజనేయులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : సాక్షి ఛానల్‌లో మహిళలను కించపరిచేలా మాట్లాడిన ఆ ఛానల్ ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసులు, కృష్ణంరాజుపై చర్యలు తీసుకోవాలని టిడిపి నాయకులు, తెలుగు మహిళా సంఘాల ప్రతినిధులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంతకుముందు పట్టణ పోలీస్‌స్టేషన్ ముందు నిరసన తెలిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చర్చా వేదికలో మాట్లాడడం దుర్మార్గం అన్నారు. మహిళలను అసభ్య పదజాలంతో అవమానపరిచిన వారు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ అధ్యక్షురాలు పద్మావతి, కార్యదర్శి రామ తులసమ్మ, ఆర్‌పియు నాయకులు గంగమ్మ, లక్ష్మీకుమారి, పుష్ప, ధరణి, గాయత్రి, శోభారాణి, భవాని, మాజీ జడ్పిటిసి చెన్నకేశవులు, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు ఉమాపతి, గంగాధర్‌నాయుడు, అమ్మినేని కేశవ నాయుడు, కోనంకి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రిక ప్రతులు దహనం చేసి తెలుగు మహిళల నిరసన


పెనుకొండలో సాక్షి దినపత్రిక ప్రతులను దహనంచేస్తున్న తెలుగుమహిళలు, పుట్టపర్తిలో ఫిర్యాదు చేస్తున్న మహిళలు